

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | ఆదివారం | నవంబర్ 26, 2023 | www.navatelangana.com



కేసీఆర్ అవినీతి పాలనను అంతమొందించాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు విజయశాంతి
- దిలావర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో రోడ్‌షో

5లో...



ఎంతమంది యోగీలు వచ్చినా బీఎస్పీ గెలుపు ఆపలేరు

- విలేకరుల సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, సిర్పూర్(టి) అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

6లో...

కాంగ్రెస్‌లో కదనోత్సాహం..!

- శ్రేణుల్లో భరోసా నింపిన రాహుల్‌గాంధీ పర్యటన
- ఆరు గ్యారెంటీలతో అన్ని వర్గాలకు న్యాయం
- ప్రజల తెలంగాణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని వ్యాఖ్య
- విజయభేరీ సభకు భారీగా తరలివచ్చిన జనం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నిర్వహించిన విజయభేరి సభ విజయవంతమైంది. ఎన్నికల ముంగిట కాంగ్రెస్ శ్రేణుల్లో భరోసా నింపుతోంది. శనివారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహించిన ఈ సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ముఖ్య అతిథిగా హాజరుకావడంతో హస్తం శ్రేణుల్లో కదనోత్సాహం కనిపించింది. ఇది వరకే ఆ పార్టీ నిర్వహించిన సభకు రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరై శ్రేణుల్లో ఉత్సాహం నింపగా.. తాజాగా ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరుకావడంతో గెలుపుపై కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పల్లెలు, పట్టణాల నుంచి భారీ సంఖ్యలో జనాలు తరలివచ్చారు. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమైన ఈ సభకు ఉదయం 11గంటల నుంచే జనాల రాక మొదలైంది. రాహుల్ వచ్చే సమయానికి జనాలు సభా ప్రాంగణంలో నిండిపోయారు. కాంగ్రెస్ జెండాలు, జై కాంగ్రెస్ నినాదాలతో హోరెత్తించారు. రాహుల్ ప్రసంగిస్తున్నంత సేపు ప్రజలు ఆసక్తిగా విన్నారు. మరో ఐదు రోజుల్లో పోలింగ్ జరగనుండగా నిర్వహించిన తాజా సభ ఆ పార్టీ అభ్యర్థితో పాటు నాయకులు, కార్యకర్తల్లో కొత్త జోష్‌ను తీసుకొచ్చింది.



ప్రజల తెలంగాణ తీసుకొస్తాం

విజయభేరి సభలో మాట్లాడిన రాహుల్‌గాంధీ ప్రజలు ఆకట్టుకునేలా ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడె గజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంత ప్రజలు కొట్లాడి సాధించిన తెలంగాణ ఇది కాదని, ఇది దొరల తెలంగాణలా కనిపిస్తోంది, కాంగ్రెస్ వస్తే ప్రజల తెలంగాణ ఎలా ఉంటుందో చూపిస్తామని పేర్కొనడంతో జనాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుత పాలనలో కేసీఆర్ కుటుంబమే లాభపడిందని, పేదలకు ఎలాంటి ప్రయోజనం దక్కడం లేదని వివరించారు. తెలంగాణ మిగతా..2లో...



ఆసిఫాబాద్‌లో నెగ్గేదెవరు..?



- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ
- ప్రజలను ఆకర్షించేందుకు పోటాపోటీ ప్రచారం
- ముమ్మర ప్రచారంతో వేడెక్కిన సమరం

ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎన్నికల సమరం రసవత్తరంగా మారుతోంది. పోలింగ్‌కు మరో ఐదు రోజులు మాత్రమే సమయం ఉండటంతో నువ్వా- నేనా రీతిలో సమరం సాగుతోంది. ఇక్కడ ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ నెలకొందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ముగ్గురి నేతల్లో ఎవరు నెగ్గుతారోననే తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ విజయం సాధించగా.. బీఆర్ఎస్, బీజేపీ ఓటమి పాలయ్యాయి. తాజా ఎన్నికల్లో ఇక్కడ మరోసారి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ తీవ్రంగా కనిపిస్తోంది. కానీ పాత ప్రత్యర్థులు కాకుండా బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే కోవలక్ష్మి తలపడుతుండగా.. కాంగ్రెస్ నుంచి అజ్మీరా శ్యాంనాయక్, బీజేపీ నుంచి అజ్మీరా ఆత్మారాం నాయక్ పోటీ చేస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్రులు సైతం గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ నియోజకవర్గంలో జరుగుతున్న ఈ రసవత్తర పోరులో ఎవరు నెగ్గుతారో..ఎవరు ఓటమి పొందుతారోననే చర్చ జోరుగా సాగుతోంది.

నవతెలంగాణ - ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదివాసీ ఓటర్లు అధికంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల సమరం రసకందాయంగా మారుతోంది. పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో ఎన్నికల పోరు మరింత వేడెక్కుతోంది. ఈ నియోజకవర్గంలో 2,26,778 ఓట్లు ఉండగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు 21మంది నామినేషన్లు వేశారు. ఇందులో నలుగురివి తిరస్కరణకు గురికాగా మరో నలుగురు ఉపసంహరించుకున్నారు. చివరకు 13మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ నుంచి కోవ లక్ష్మి, కాంగ్రెస్ నుంచి ఆజ్మీరా శ్యాంనాయక్, బీజేపీ నుంచి ఆజ్మీరా ఆత్మారాంనాయక్‌తో పాటు పలువురు స్వతంత్రులు పోటీ చేస్తున్నారు. కానీ ఇక్కడ ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యనే రసవత్తర పోరు జరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కిందటి మిగతా..2లో...

బీసీ జనగణనకు మోడీ సర్కారు వెంటనే ఆదేశాలివ్వాలి

- మంచిర్యాల జిల్లా బీసీ సంఘాల డిమాండ్



నినాదాలు చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

నవతెలంగాణ-హాజీపూర్

ఎస్సీ వర్గీకరణ తరహాలోనే బీసీ జన గణనకు సైతం కేంద్ర ప్రభుత్వం సత్వరం ఆదేశాలు ఇవ్వాలని వివిధ బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాలలోని బీసీ ఐక్యవేదిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దళితుల విషయంలో మోడీ ప్రభుత్వం చొరవ తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని, బీసీ జనగణన విషయంలో నిర్లక్ష్యం చేయడం తగదని హెచ్చరించారు. 10 శాతం జనాభా ఉన్న మాదిగల విషయంలో చూపుతున్న శ్రద్ధ 60 శాతం జనాభా ఉన్న బీసీల విషయంలో కూడా మిగతా..2లో...

ఆసిఫాబాద్‌లో నెగ్గేదెవరు..?

(మొదటి పేజీ తరువాయి)

సారి కాంగ్రెస్ విజయం సాధించగా.. మరోసారి గెలిచేందుకు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తోంది. ఇక్కడ 2014 ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ తాజా ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయాలని భావిస్తోంది. ఇక గత ఎన్నికల్లో సుమారు 5700 వరకు ఓట్లు సాధించిన బీజేపీ ఈ సారి గణనీయమైన ఓట్లు సాధించి విజయం సాధించాలని భావిస్తోంది. మరోపక్క బీజేపీ టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా కొట్నాక్ విజయం, సిడాం అన్నిగాతో పాటు పలువురు స్వతంత్రులు పోటీలో నిలిచారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ ఓటమి చవిచూశారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆత్రం సక్కు విజయం సాధించి కొద్ది రోజులకు గులాబీ గూటికి చేరిపోవడంతో ప్రస్తుతం ఇక్కడ అధికార పార్టీ అభ్యర్థి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు కాకుండా జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే కోవ లక్ష్మీకి టికెట్ కేటాయించింది. ఆత్రం సక్కును ఎంపీ బరిలో నిలుపుతామని ఆ పార్టీ అధిష్టానం హామీనిచ్చినట్లు తెలిసింది. కాంగ్రెస్ నుంచి ఉద్యోగం నుంచి పదవీ విరమణ పొందిన ఆజ్మీరా శ్యాంనాయక్‌ను రంగంలోకి దిగారు. బీజేపీ నుంచి ఆత్మారాం నాయక్ పోటీ పడుతున్నారు.

నువ్వా- నేనా అనే రీతిలో పోటీ..!

ప్రస్తుతం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల సమరం రసవత్తరంగా మారుతోంది. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ తాజా ఎన్నికల్లో విజయం సాధించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆదివాసీ ఓటర్లు అధికంగా ఉండటం, గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో పాటు కిందటి ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి కూడా తాజా ఎన్నికల్లో కలిసిరానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో అంతగా అభివృద్ధి కనిపించడం లేదని, కిందిస్థాయి నాయకుల సహకారం అంతగా అందడం లేదని, విస్తృతంగా ప్రచారం చేయకపోవడం వంటి కారణాలు ప్రతికూలంగా మారే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క కాంగ్రెస్ నుంచి బరిలో దిగిన శ్యాంనాయక్ ఇది వరకు రవాణశాఖ అధికారి ఇదే జిల్లాలో పనిచేశారు. ఆయన భార్య ప్రస్తుత ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇది వరకు ఆసిఫాబాద్ జడ్పీటీసీగా పనిచేయడంతో స్థానికంగా పరిచయాలు ఉండటంతో పాటు కాంగ్రెస్ పార్టీ గాలివీయడం ఆయనకు సానుకూలంగా మారుతాయనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క ఇక్కడ ఆదివాసీల ఓట్లు అధికంగా ఉండటం, ఇది వరకు కీలక నాయకులైన సరస్వతి, గణేష్‌రాథోడ్‌లు పార్టీకి దూరం కావడంతో పాటు కింది స్థాయి నాయకులను పట్టించుకోవడం లేదనే అపవాదు ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక బీజేపీ నుంచి మరోసారి పోటీ చేస్తున్న ఆజ్మీరా ఆత్మారాం నాయక్ గత ఎన్నికల్లో సుమారు 5700 వరకు ఓట్లు సాధించారు. ఈ సారి మోడీకి ఉన్న జనాకర్షణ, పట్టణ ఓటర్లు పార్టీ పట్ల అనుకూలతలు ఆయనకు సానుకూలంగా మారగా.. బీజేపీకి నియోజకవర్గంలో అంతగా బలం లేకపోవడం, ఇదే పార్టీ నుంచి స్వతంత్ర అభ్యర్థి బరిలో ఉండటంతో ఓట్లు చీలే అవకాశం ఉందనే ప్రచారం ప్రతికూలంగా మారనుందనే భావన వ్యక్తమవుతోంది. వీరితో పాటు ఒకరిద్దరు స్వతంత్ర అభ్యర్థులు సైతం గణనీయమైన సంఖ్యలో ఓట్లు సాధించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ తుది పోరులో ఎవరు నెగ్గుతారోననేది డిసెంబర్ 3న వెల్లడికానుంది.

కాంగ్రెస్‌లో కదనోత్సాహం..!

(మొదటి పేజీ తరువాయి)



దోపిడీకి గురైందని, కొన్ని వర్గాలకే ప్రాధాన్యం లభిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రజల తెలంగాణ తీసుకొస్తామని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను చట్టాలుగా మార్చి అమలు చేస్తామని భరోసా ఇవ్వడంతో సభలో ఒక్కసారిగా చప్పట్లు మారుమోగాయి. తెలంగాణలో రైతులు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడకూడదని.. మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని, యువతకు ఉపాధి లభించేలా పథకాలు అమలు చేస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీల ద్వారా ఆయా వర్గాలకు కలిగే ప్రయోజనాలను స్పష్టంగా వివరించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన ఓ మహిళ, చిన్నారిని వేదిక మీదకు పిలిచి వారితో మాట్లాడించడంతో సభా ప్రాంగణంలో జనాలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేయడం కనిపించింది.

భారీగా హాజరైన జనం..!

కాంగ్రెస్ నిర్వహించిన విజయభేరి సభకు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఉదయం 11గంటల నుంచే ఆటోలు,బస్సులు, ఇతర వాహనాల ద్వారా జిల్లా కేంద్రానికి వరుస కట్టారు. కాంగ్రెస్ జెండాలు చేతపట్టి జై కాంగ్రెస్ నినాదాలతో సభా ప్రాంగణానికి తరలివచ్చారు. సభా ప్రాంగణంతో పాటు పరిసరాలు కాంగ్రెస్ జెండాలతో కనిపించాయి. వేలాది మంది తరలిరావడంతో సభా ప్రాంగణం కాంగ్రెస్ నినాదాలతో హోరెత్తిపోయింది. మధ్యాహ్నం 2గంటలకు రాహుల్ సభా వేదికపై రావడంతో ఆ పార్టీ శ్రేణులు, ప్రజలు ఒక్కసారిగా జై కాంగ్రెస్ నినాదాలతో హోరెత్తించారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కేరింతలు కొడుతూ తమ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. దీంతో పోలింగ్ ముంగిట నిర్వహించిన రాహుల్‌గాంధీ సభతో విజయం సాధించడం సులువుగా మారిందని ఆ పార్టీ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అంతకుముందు ఆ పార్టీ ముఖ్య నాయకులు రాహుల్‌గాంధీకి అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు నరేష్‌జాదవ్, సీనియర్ నాయకుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, గిమ్మ సంతోష్, భరత్ వాఘ్మారే, సామ రూపేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా : కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి

ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిషలు కృషిచేస్తానని కంది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సాత్నాల, మత్తడివాగు, లక్ష్మీపూర్, సోన్‌కాస్ ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే నిర్మించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాల్లో ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధిని గాలికొదిలేసిందని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

ఆదిలాబాద్‌అర్బన్ : తెలంగాణ చేనేత ఐక్యవేదిక యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆదిలాబాద్ తాలూకా పద్మశాలి సంఘం సలహాదారులు, అనుకుంట గ్రామనివాసి గాజుల జగన్నాథ్‌తో పాటు బంగారుగూడ, అనుకుంట, ఆదిలాబాద్‌కు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో వీరికి మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ జనగణనకు మోడీ సర్కారు వెంటనే ఆదేశాలివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

చూపెట్టాలని వారు డిమాండు చేశారు. అధికారంలోకి వస్తే బీసీ జనగణన చేపడతామని హామీ ఇచ్చి పది సంవత్సరాలు దాటినా ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు తీర్పిచ్చిందని, బీసీ జనగణన విషయంలో ఎలాంటి అడ్డంకులూ లేవని తెలిపారు. అన్ని పార్టీలు సమర్థించినా నరేంద్ర మోడీ ప్రభుత్వం బీసీ జనగణన మొదలు పెట్టకపోవడం బాధాకరమని తెలిపారు. అగ్రవర్ణాల ఒత్తిళ్లకు తలొగ్గి మెజార్టీ వర్గాలైన బీసీలకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీల హక్కుల విషయంలో చొరవ లోపించడం బీసీ వర్గాలను మోసగించడమేనని వారు తెలిపారు. ఆలస్యం చెయకుండా బీసీ జనగణన చేపట్టాలని, బీసీ రిజర్వేషన్ల పెంపుదల చేసే వారికే బీసీ వర్గాల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. బీసీ జనగణనకి సత్వరం ఆదేశాలు ఇచ్చి, బీసీ రిజర్వేషన్ల పెంపుకు కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై హక్కు కులవివక్షకు గురైన బీసీ, ఎస్సీ, ఎస్టీలకే ఉంటుందని, అగ్రవర్ణాల 10 శాతం రిజర్వేషన్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సీనియర్ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షులు బుద్దె చంద్రమౌళి, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, మేరు సంఘం నాయకులు మాడిశెట్టి విశ్వం, బీసీ నాయకులు కోటిలింగం, సుంక లక్ష్మణ్, సోమన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

నవతెలంగాణ-కడెం

ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో ఖానాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యం ఆధ్వర్యంలో ధర్మాజీపేట్ గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ అలెగ్జాండర్, తుమ్మల మల్లేష్, కుమ్మరి రమేష్, వాజీద్, కొత్త మద్దిపడగ సర్పంచ్ ఇందుర్, ఇస్రు పాల్గొన్నారు.

గిరిజనులు ఎటు వైపు..?

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ నియోజకవర్గంలో ఇతరుల కంటే ఎక్కువగా ఉన్న ఆదివాసీ సామాజికవర్గం ఓట్లు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే విధంగా ఉన్నాయి. నియోజక వర్గంలో మొత్తం 2లక్షల 17 వేల ఓటర్లు ఉండగా అందులో సుమారు 42వేల వరకు ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఉంటాయి. అదేవిధంగా లంబాడ సామాజికవర్గం ఓటర్ల ప్రభావం ఉన్నప్పటికీ వారంతా ఏకాభిప్రాయానికి రావడం కష్టమే. ప్రస్తుతం ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీఎస్పీ, బీజేపీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ముగ్గురు కూడ లంబాడా సామాజిక వర్గానికి చెందిన వారే దీంతో లంబాడా కంటె ఆదివాసీ ఓట్లు ఎక్కువగా ఉండటంతో ఆదివాసీ ఓట్లే కీలకంగా మారాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెడ్మ బొజ్జు ఆదివాసీ వర్గానికి చెందినవాడు కావడంతో ఆదివాసీ ఓట్లు కాంగ్రెస్‌కు కలిసోచ్చే అవకాలున్నాయి. ఇతర సామాజిక వర్గాల ఓటర్లను ఆకట్టుకోవడంలో ఆ పార్టీ నాయకులు పూర్తిగా విఫలమవుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల పలువురు ఆదివాసీ నాయకులు సైతం బీఆర్ఎస్‌కు మద్దతుగా పనిచేస్తామని పార్టీలో చేరిపోయారు. ఎవరు ఎటు మారిన చివరికి తమ ఆదివాసీలంతా ఏకతాటికి వస్తారని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. నియోజకవర్గంలో గిరిజనుల్లో ఆదివాసులతో పాటు లంబాడ సామాజికవర్గం ఓట్లు కూడా కీలకంగా ఉన్నాయి. తండాల్లో చేసుకునే తీర్మాణాల మేరకే మద్దతునిచ్చే అవకాశం ఉంది. సుమారు 32 వేల వరకు ఓటర్లు ఉన్న వీరు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతునిచ్చే అవకాశమే లేదని పేర్కొంటున్నారు. ఈ సారి ఎన్నికల్లో లంబాడ సామాజిక వర్గం బీజేపీ నుంచి రమేష్ రాథోడ్, బీఆర్ఎస్ నుంచి భూక్యా జాన్సన్ నాయక్, బీఎస్పీ నుంచి బన్సీలాల్ రాథోడ్ బరిలో ఉన్నారు. ఈ క్రమంలో లంబాడాల ఓట్లు చీలిపోతాయన్న ప్రచారం జరుగుతోంది. లంబాడాల మెజార్టీ ఓటర్లు ఏ పార్టీ అభ్యర్థి వైపునకు మొగ్గ చూపుతారో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి నెలకొందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

● కీలకంగా మారనున్న ఆదివాసుల ఓట్లు



ప్రజలను గెలిపించేందుకే ముందుకు వచ్చా..

● బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్



నవతెలంగాణ-కడెం

ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలను గెలిపించడం కోసమే ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముందుకు వచ్చానని భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఎస్‌కె ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఆదివాసుల ఆత్మీయ సమ్మేళననానికి ముఖ్య అతిథిగా జాన్సన్ నాయక్ హాజరై మాట్లాడారు. ఆదివాసుల అభ్యున్నతి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఆదివాసులు అభివృద్ధి చెందాలంటే ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగిరివేయడానికి ఆదివాసులందరూ కృషి చేయాలని అన్నారు. నియోజకవర్గంలోని ఆదివాసుల కష్టాల గురించి, తెలుసునని అన్నారు. ఈ అసెంబ్లీ ఎలక్షన్‌లో కారు గుర్తుకు ఓటు వేసి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నియోజకవర్గంలో ఆదివాసుల అభివృద్ధికి బంగారు బాటలు వేస్తానని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రజలందరూ తన కుటుంబంతో సమానమని, ప్రజల సమస్యల సాధనకై నిరంతరం కృషి చేస్తానని, తండాలను గూడాలను అభివృద్ధి చేయడంలో ప్రత్యేక దృష్టి సాధిస్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదివాసుల సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరే విధంగా కృషి చేస్తానన్నారు. ఆదివాసులందరూ ఏకతాటిపైకి వచ్చి కారు గుర్తుకు ఓటు భారీ మెజారిటీతో భూక్య జాన్సన్ నాయక్ గెలుపొందించాలని కోరారు. అనంతరం ఆదివాసులు మాట్లాడుతూ విద్యావంతుడైన జాన్సన్ నాయక్‌కే మా మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆదివాసీ ముఖ్య నాయకులు, ఆదివాసులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక హక్కులకు నిలబడాలి



నవతెలంగాణ-కడెం

ప్రజాస్వామిక హక్కులకై నిలబడి ఫాసిస్టు వ్యతిరేఖ శక్తులను గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు నంది రామయ్య అన్నారు. శనివారం మండలంలో ధర్మాజీపేట్, నర్సపూర్, తండా తదితర గ్రామాల్లో ప్రచారం చేసిన అనంతరం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల చైతన్యానికి తమకు కావాల్సిన మంచి ప్రభుత్వాన్ని ఎంచుకోవడానికి బలమైన ఆయుధం ఓటు అని అన్నారు. కానీ పాలకులు ఓటును అంగట్లో సరుకులు చేశారని అన్నారు. మోసపు వాగ్దానాలతో బీజేపీ ప్రభుత్వం ఫాసిస్ట్ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తోందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు మోడీ స్నేహితుడైన అదానికి ఇతర కార్పొరేట్లకు కట్టబెడుతుందని అన్నారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని అన్నారు. ఫాసిస్ట్ విధానాలను అనుసరిస్తున్న బీజేపీ సర్కార్‌కు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ప్రజాస్వామిక వాదులను, కవులను, రచయితలను ప్రశ్నించే గొంతులను నొక్కుతూ జైలుకు పంపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా మండల నాయకులు దాసండ్ల సుదర్శన్, ఎఐపీకేఎస్ ప్రగతిశీల రైతు సంఘం జిల్లా, మండల నాయకులు జక్కుల రాజన్న, కుంచపు ఎల్లయ్య, గోరె భాయ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ గెలుపు ఖాయం'

నవతెలంగాణ-కడెం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్ గుప్త అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు గడప గడపకు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూక్యా జాన్సన్ నాయక్‌కు ప్రజల్లో కనిపిస్తున్న ఆదరణ చూసి గెలుపు ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి, ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను గురించి ప్రజలకు వివరిస్తూ ఖానాపూర్ నియోజకవర్గం అభివద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి జాన్సన్ నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా జడ్పీ కోఆప్షన్ సభ్యులు, ఎండీ రఫిక్ అహ్మద్, కడెం సర్పంచ్ కొండాపురం అనూష లక్ష్మణ్, ఖానాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయిని మంగ, నస్రత్ ఫాతిమా, బీఆర్ఎస్ పార్టీ కడెం మండల ప్రచార కార్యదర్శి ముబారక్ బీన్ మొహమ్మద్, కడెం టౌన్ అధ్యక్షులు కే రవి, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే హైమద్, పార్టీ సీనియర్ నాయకులు చిట్టేటి ముత్తన్న, నల్లగొండ, సపవత్ రవి, గౌసోద్దీన్, ఎండీ కలీం, ఎండీ హసీబ్, బోర్లకుంట రాజేష్, కత్తర్ పాక శేఖర్, వేణు నాయక్, భూక్య శేఖర్, గంగన్న, జాడి నర్సయ్య, సయ్యద్ షకీల్, సయ్యద్ నుస్రత్, ఆర్ల రాజేశ్వరి, కరుణ, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ఎస్పీ

నవతెలంగాణ-నిర్మల్



శాసనసభ ఎన్నికల్లో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో శనివారం జిల్లా ఎస్పీ చల్లా ప్రవీణ్ కుమార్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కడెం

గ్రామీణ ఉపాధిహామి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ విజయలక్ష్మి సూచించారు. శనివారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండల ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని డీఆర్డీఓ విజయలక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరిగిన ఉపాధిహామీ పనుల పట్ల సామాజిక తనిఖీ నిర్వహించారు. పలు గ్రామాల ఈజీఎస్ సిబ్బంది నిర్వాహకం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో జరిగే పనులను ప్రజలు సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఏపీఓ జయదేవ్, ఏపీఎం రాజారామ్ మండల అధికారులు కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే మరోసారి పట్టం కట్టాలి

● మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్



ప్రచారంలో నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, బీఆర్ఎస్ కార్యకర్తలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఎమ్మెల్యే జోగు రామన్నకు ఓటేసి బీఆర్ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని జైజవాన్‌నగర్, మహాలక్ష్మివాడ కాలనీల్లో విస్తృతంగా ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడమే కాకుండా ప్రజలు కొన్నేండ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామని అన్నారు. రైతుబంధు, రైతుబీమా వంటి బృహత్తర పథకాలను ప్రవేశపెట్టిన తమ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని గుర్తు చేశారు. రైతుబంధు నగదు విడుదలపై ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయాన్నీ గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందన్న ఆ పార్టీ నాయకుల వ్యాఖ్యలు రైతు సంక్షేమంపై వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాహితమే పరమావధిగా అహర్నిశలు పాటు పడుతున్న బీఆర్ఎస్ పార్టీకే మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సంద నర్సింగ్, పందిరి భూమన్న, రైతుబంధు సమితి అధ్యక్షులు రోకండ్ల రమేష్, నాయకులు రంగినేని శ్రీనివాస్, గోలి శంకర్ పాల్గొన్నారు.

'రైతుబంధు ఆపాలని కాంగ్రెస్, బీజేపీ చూసింది'



అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

నవతెలంగాణ-తాంసి

రైతులకు అందించే రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో వేయడాన్ని ఆపాలని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎంతో ప్రయత్నం చేశాయని ఇలాంటి పార్టీలకు రైతులు ఓటు వేయవద్దని బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన యువకులు అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి నా గెలుపు కోసం అందరూ కృషి చేయాలని అన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ బీజేపీ పార్టీలకు రైతులపై ఎలాంటి ప్రేమ లేదన్నారు. రైతులకు ఇచ్చే రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో వేయకుండా ఎంతో ప్రయత్నం చేశాయి. అలాంటి పార్టీలకు ఓటు వేయవద్దని అన్నారు. రైతుల సంక్షేమం కోరే ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు. ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో తనను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపుతారని ఎంతో నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్, కన్వీనర్ నాగయ్య, నాయకులు సంతోష్, అనిల్, అఫ్రోజ్, భూమన్న, లింబాజి, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి

● మాజీ మంత్రి గోడం నగేష్



బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న మాజీ మంత్రి గోడం నగేష్

నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తోందని మాజీ మంత్రి గోడం నగేష్ అన్నారు. శనివారం మండలంలోని ఉండం, సుంకిడి, లింగి, కుచులాపూర్, పల్సి(బి) తండ, అర్లి(కె) గ్రామాల్లో పర్యటించి కారు గుర్తుకు ఓటు వేయాలని గ్రామ ప్రజలని కోరారు. అర్లి(కె) గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత సీఎం కేసీఆర్ దేశంలోనే ఆర్థికంగా అన్ని రంగాల్లో నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రిదేనని అన్నారు. పంటల ఉత్పత్తి పరిశ్రమలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు కాగ్ నివేదికలో వెల్లడైనట్లు తెలిపారు. స్వాతంత్య్రం ఏర్పడినప్పటి నుంచి ఏ రాజకీయ పార్టీలు చేయని అభివృద్ధి కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే జరిగిందన్నారు. ఉపాధి హామీతోపాటు అన్ని వర్గాల ప్రజలకు వివిధ పథకాలను అమలు చేసి రాష్ట్ర ప్రజలకు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అనిల్ జాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న వారిలో ఆ పార్టీ నాయకులు తోట వెంకటేష్, చంద్రకాంత్, చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, కేదారీశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, సర్పంచులు కంది పోచ్చుబాయి, రాంబాయి, నారా కిష్టన్న, దేవరావు, రేవతి పోచ్చన్న, అభిరామ్‌రెడ్డి, నేతుల గంగన్న, బొండ్ల స్వామి, మాదారి మల్లేష్, రమాకాంత్, సత్యనారాయణ, తిరుపతి, స్వామి, దీపక్, రవీందర్, రంజిత్‌రెడ్డి, వివిధ గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్‌పై అవగాహన

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం మాక్ పోలింగ్‌పై అవగాహన కల్పించారు. కలెక్టర్, ఎస్పీ వేషధారణలో పోలింగ్ బూత్‌ల పరిశీలన, బీఎల్ఓ, ప్రిసైడింగ్ అధికారి ఏజెంట్ల పనితీరును పరిశీలించారు. విద్యార్థులు వ్యవహరించిన తీరు ఓ దశలో సాధారణ ఎన్నికల ఏర్పాట్లను తలపించాయి. అనంతరం పోలింగ్ నిర్వహించగా.. విద్యార్థులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావ్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మెన్ నేతుల గంగన్న, ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, మురళీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, ఉంగరం గుర్తుకు ఓటేసి ఆదరించాలని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సంజీవ్‌రెడ్డి అన్నారు. శనివారం మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాతతో కలిసి మండలంలోని బట్టిసవర్గాం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలుకూరి రామచంద్రారెడ్డి ఆశయాలను కొనసాగించాలని అన్నారు. ఉంగరం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 17 సంవత్సరాల బాలుర జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2007 జనవరి-1 తరవాత జన్మించినవారు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ సొంత ప్లేయింగ్ కిట్లను వెంట తెచ్చుకోవాలన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రాలు బోనఫైడ్, ఆధార్, బర్త్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు కుమ్ర రాజు అన్నారు. శనివారం మండలంలోని మామిడిగూడలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. కారుగుర్తుకు ఓటేసి జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మామిడి గూడ సర్పంచ్ యాదవరావు, ఎంపీటీసీ జంగుబాపు, పరమేశ్వర్, భీంరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ-బాసర

మండల పరిధిలోని సావర్గావ్ గ్రామంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ ప్రచారాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామాలలో అభ్యర్థి విఠల్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. సావర్గావ్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తుండగా విఠల్‌రెడ్డిని దళితబంధు విషయమై గ్రామ యువకులు ప్రశ్నించారు. దీంతో వివాదం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తుల మధ్య వాగ్వాదం తలెత్తింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యామ్ కంటికి, కార్తీక్ చేయికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని నిజామాబాద్ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి, నాయకులు ప్రచారాన్ని అర్థాంతరంగా ముగించారు.

కేసీఆర్ అవినీతి పాలనను అంతమొందించాలి

● కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు విజయశాంతి



ప్రచారంలో భాగంగా సారంగాపూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు విజయశాంతి

నవతెలంగాణ-దిలావర్‌పూర్, సారంగాపూర్

తెలంగాణలో కేసీఆర్ పాలనను అంతమొందించాలని కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి అన్నారు. శనివారం కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని యావత్ తెలంగాణ ప్రజలు కొట్లాడి సాధించుకున్నామని అన్నారు. కానీ కేసీఆర్ మాత్రం తన కుటుంబ సభ్యుల పదవుల కోసం ఆరాటపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి బీజేపీ నాయకులు భూములు కొలుగోలు చేస్తే, బీఆర్ఎస్ మంత్రి అనుమతులు తెచ్చారని ప్రజలు గమనించాలని కోరారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు కూచాడి శ్రీహరిరావుని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, అరుగుల రమణ, కట్కం రాజారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, యుసుఫ్, వసీం, కోడె శ్రీనివాస్, తెడ్డు గోపాల్, జూస్ కలీం, రావుల దేవిదాస్, బొల్ల ధయాకర్, బెల్లాజి రాజు, కోడె మనేష్, షఫీ పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో....

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ పార్టీ కోకన్వీనర్ విజయశాంతి అన్నారు శనివారం మండలకేంద్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు మంత్రులు చేసిన అవినీతి పాలలను గద్దెదించే సమయం ఆసన్నమైందని అన్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీకి ఈ ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీహరిరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులను ఎమ్మెల్యేలను సైతం వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. అవినీతి సొమ్మును కక్కించడం ఖాయమని ఘటుగా విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సాధు సుదర్శన్, దశరథ రాజేశ్వర్, భోల్లోజి నర్సయ్య, ఎస్‌కె హదీ, సలీం, నారాయణరెడ్డి, భోజాగౌడ్, భీంరావు, తేజు రాజు పాల్గొన్నారు.

కేసీఆర్ మరోసారి మోసం చేస్తాడు..జాగ్రత్త

● కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడే గజేందర్



చాయ్ పోస్తు ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆడే గజేందర్

నవతెలంగాణ-తాంసి

ప్రజలను సీఎం కేసీఆర్ మరోసారి మోసం చేయడానికి వస్తున్నాడని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బోథ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడే గజేంధర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. మొదటగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రచారంలో పాల్గొన్నారు. విద్యార్థులకు, రైతులకు, నిరుద్యోగులకు, మహిళలకు, కేసీఆర్ ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా చేసిన మోసాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని అన్నారు. ప్రజలను మోసం చేయడానికి ఇద్దరు కలిసి ఎన్నికల్లో గెలవడానికి కల్లబొల్లి మాటలు హామీలతో వస్తున్నారని అన్నారు. ప్రజలందరూ జాగ్రత్తగా గమనించి వారిని తరిమికొట్టాలని తెలిపారు. గత ఎన్నికల్లో కేసీఅర్ నిరుద్యోగులకు, రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మీ అందరి మద్దతు ఎంతో అవసరమన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను బలపర్చాలన్నారు. మీరందరూ చేతి గుర్తుకు ఓటు వేసి నన్ను అసెంబ్లీకి పంపే బాధ్యత మీ చేతుల్లోనే ఉందన్నారు. గత కాంగ్రెస్ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్తు, రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు ఎంపీగా గెలిచి ఏ ఒక్క రూపాయి కూడా మన బోథ్ నియోజకవర్గంలో అభివృద్ధి చేయలేని వ్యక్తి మళ్లీ ఓటు అడగడానికి రావడం సిగ్గుచేటని అన్నారు. అలాంటి వ్యక్తులకు ఓటుతో గుణపాఠం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తలమడుగు జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి, కన్వీనర్ వెంకట్‌రెడ్డి, నాయకులు రామన్న యాదవ్, గంగారెడ్డి, కిషన్, రామ్‌రెడ్డి, సీపీఐ నాయకులు దేవిదాస్, రమేష్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

● బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ● సబ్బండ వర్గాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



రోడ్డు షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

అన్నివర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధికి పట్టాం కట్టాలని అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ ఓటు వేసి బాసటగా నిలవాలని కోరారు. సంక్షేమంలో కేసీఆర్ పాలన స్వర్ణయుగమని అన్నారు. ఇలాంటి పథకాలు దేశంలో మరెక్కడా లేవని తెలిపారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో సబ్బండ వర్గాలకు అండగా నిలిచే విధంగా ఉందన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటుతో పాటు, మెడికల్ కాలేజ్ తీసుకొచ్చామని వివరించారు. సంపదను పెంచుతూ ప్రజలకు పంచుతున్నామని, ప్రస్తుత పథకాలను అన్నింటిని కొనసాగిస్తూనే, తాజా మేనిఫెస్టోలో అన్ని అంశాలను అమలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం గొప్ప విషయమన్నారు. రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా పథకాలతో రైతులందరూ బీఆర్ఎస్ వెంటే ఉన్నారని పేర్కొన్నారు. రైతుబంధు మరోసారి పెంచుతామని హామినివ్వడం గోప్ప నిర్ణయమని పేర్కొన్నారు. దీని వల్ల రైతులకు మరింత మేలు జరుగుతుందని, రైతులను నుంచి మంచి స్పందన వస్తుందని కేసీఆర్ కే మా మద్దతు అని చెబుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మండల కన్వీనర్ కోరిపెల్లి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, శాతం గంగారాం, బుర్రి లత, భూమేష్, అర్జున్‌రెడ్డి, మేకల రాజేందర్ యాదవ్, బూసి రమ, బూసి ముత్యం, కేశం రమేష్, సంగం వెంకట్‌రాజ్, సత్య నారాయణ, పడిగెల గంగాధర్, ఉల్వాజీ రాజు, గుజ్జరి గణేష్, పోతుగంటి రమేష్ కుమార్, రవీందర్, చిన్నారెడ్డి, సాయన్న, భూమారెడ్డి, సురేష్, సురేష్‌రెడ్డి, కల్లెడ భూమన్న, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

● ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

బీఆర్ఎస్‌లో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం పట్టణంలోని విద్యానగర్, సంజయ్‌నగర్ కాలనీల్లో పర్యటించారు. భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చి ప్రధాన వీధులు గుండా తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే విధంగా బతుకమ్మలతో మహిళలు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సైతం బతుకమ్మను నెత్తిన పెట్టుకుని ర్యాలిలో పాల్గొన్నారు. అనంతరం సంజయ్‌నగర్‌లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మేనిఫెస్టోలో పొందుపర్చిన అన్ని హామీలను అమలు చేసి, మహిళలకు అన్ని విధాలా అండగా నిలుస్తామని అన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా అర్హులైన మహిళలకు మూడు వేల రూపాయల భృతి అందించనున్నట్లు వివరించారు. మరోసారి కారు గుర్తుకే ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బడాల సుజాత, ఆవుల వెంకన్న, లక్ష్మణ్, నాయకులు శివకుమార్, సృజన్, మెట్టు ప్రహ్లాద్, చిన్న పటేల్ పాల్గొన్నారు.

'ఒకటో నెంబర్ కారు గుర్తుపై నొక్కి ఓటు వేద్దాం'



నవతెలంగాణ-తాంసి

బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ గుర్తు ఈవీఎంపై ఉన్న ఒకటో నెంబర్ కారు గుర్తుపై నొక్కి ఓటు వేయాలని సర్పంచ్ రత్న ప్రకాష్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలో గ్రామ యువకులతో కలిసి అనిల్ జాదవ్ గెలుపు కోసం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఈవీఎం నమోనా బ్యాలెట్‌ను పట్టుకొని ఓటు వేసే విధానాన్ని ఓటర్లకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంపై మొదటి గుర్తు కారుగుర్తు కారుగుర్తుపై నొక్కి అనిల్ జాదవ్ అన్నాను గెలిపించుకుందామని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మన గ్రామంలో అమలు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కళ్యాణ్, ముత్తన్న, విలాస్, కార్యకర్తలు కార్తిక్, ప్రసాద్, సంతోష్, లింగన్న, రాజు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించి న్యాయం చేసే పార్టీకే మద్దతు

నవతెలంగాణ-నార్నూర్

తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేసే పార్టీలకే తమ మద్దతును ఇస్తామని, గాదిగూడ మండలంలోని కుండి శేకుగూడ గ్రామపటేల్ దౌలత్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలతో పాటు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గత సంవత్సరం నుంచి పలు విధాలుగా పోరాటం చేశామని తెలిపారు. గత రెండు మూడు వారాల క్రితం ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో గ్రామస్తులంతా కలిసి ఏకగ్రీవంగా అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరిస్తామని తీర్మాణం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సమస్యలను అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తు ప్రజాస్వామ్య బద్దంగా కలిపించబడిన వజ్రాయుధం లాంటి ఓటు హక్కును వినియోగించుకుంటామని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించి, న్యాయం చేసే వారికే మా పూర్తి మద్దతు ఉంటుదని తెలిపారు.

రాజూరా సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మండలంలోని రాజూరా గ్రామపంచాయతీ సర్పంచ్ చిన్నం లావణ్య-రవీందర్ శనివారం బీఆర్‌ఎస్‌ను వీడి వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని చిన్నం లావణ్య-రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దయానంద్, నాయకులు సత్యం, షబ్బీర్ పాషా పాల్గొన్నారు.

చొప్పన్‌గూడ పాఠశాలలో వైద్య పరీక్షలు

నవతెలంగాణ-వాంకిడి

మడల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది మండలంలోని చొప్పన్‌గూడ పాఠశాలలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి చలికాలంలో వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిత్యం చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. అనారోగ్యంగా అనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ రవిదాస్, సిబ్బంది రజియా, భగవాన్‌దాస్, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట కోర్టులో శతాబ్ది ఉత్సవాలు

లక్షెట్టిపేట: శతాబ్ది ఉత్సవాల సందర్భంగా యువ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. శనివారం లక్షెట్టిపేట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో వంద సంవత్సరాల సందర్భంగా జడ్జి అసదుల్లా షరీఫ్ న్యాయవాదులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించడం జరిగిందని, భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

'ఎంతమంది యోగీలు వచ్చినా బీఎస్పీ గెలుపు ఆపలేరు'

నవతెలంగాణ-కౌటాల

ఎంతమంది యోగీలు వచ్చిన బీఎస్పీ గెలుపు ఆపలేరని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని, బీఎస్పీకి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక రోజుకో ముఖ్యమంత్రిని బీజేపీ తీసుకొస్తుందని, దానికి బీటీంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తుందని ఎద్దేవ చేశారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న సిర్పూర్ గడ్డను ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆధిత్యనాథ్ మతకల్లోలు సృష్టించడానికి వచ్చినట్లుందని ఆయన అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను చివరికి ప్రధానమంత్రి మోదీని తీసుకొచ్చిన సిర్పూర్ గడ్డపై బీఎస్పీ గెలుపును ఆపడం ఎవరితరం కాదన్నారు. సీఎం యోగీ అవగాహన లేకుండా మాట్లాడడం సిగ్గుచేటుగా ఉందన్నారు. ఎవరు ఎవరికి బీటీమో ఓటర్లు గుర్తించారని, ఈ నెల 30న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీకి ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించడం జరుగుతుందన్నారు. బీజేపీకి బీఆర్ఎస్ బీటీం కాకపోతే లిక్కర్ స్కాంలో కవితను ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ బీజేపీకి బీటీం కాబట్టే కవితను అరెస్టు చేయడంలేదన్నారు. ఎలక్షన్ కమీషన్‌తో కుమ్మక్కై రైతుబంధు డిసెంబర్‌లో వేసేది ఉండగా నవంబర్ 28లోపే వేయడం ఏంటాని ప్రశ్నించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను సన్మానించామని సీఎం యోగీ ఆధిత్యనాథ్ చెప్పడం వినడానికి విడ్డూరంగా ఉందన్నారు. గుజరాత్‌లో రెండు వేల మంది ముస్లీంలను ఊచకోత కోయించిన బీజేపీ ప్రభుత్వం రాబోయే రోజుల్లో మతకల్లోలు సృష్టించడమే తప్పా శాంతియుతాన్ని కోరుకోదన్నారు. మధ్యప్రదేశ్‌లో ఆదివాసులపై బీజేపీ నాయకులు మూత్రం పోశారని, దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటుగా ఉందన్నారు. రాజ్యాంగ నిర్మాతైన బహుజన్ సమాజ్‌వాది పేరు చెప్పుకొని బహుజనులను అనగదొక్కాలని చూడడం అరాచకమన్నారు. యూపీలో బీఎస్పీ ఎంపీ ఒకే సీటు ఉందని యోగీ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. 1984లో బీజేపీకి యూపీలో రెండే ఎంపీ సీట్లు ఉన్నవి మరిచిపోయి మాట్లాడుతున్నాడన్నారు. రాజకీయాల్లో గెలుపుపోటములు సాదరణమేనని, అది ప్రజా ఆదరణపై ఆధారపడి ఉంటుందని, అవగాహన రాహిత్యంగా ఒక సీఎం హోదాలో ఉండి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మేము జనాలను నమ్మినము, జనం నన్ను గెలుపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ తెలంగాణలోని ఆరె కులస్తులను ఓబీసీలో చేర్చడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. హిందువులను అణచివేసే పార్టీ బీజేపీనేనని ఆరోపించారు. బీజేపీని నమ్మవద్దని, బీసీలు ఆగం కావద్దన్నారు. ఆయన వెంట పార్లమెంటు ఏడు రాష్ట్రాల కోఆర్డినేటర్ రాంజీగౌతమ్, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ మండ ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి ఉన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
ఆదివారం నవంబర్ 26, 2023

సమన్వయంతో ప్రచారం నిర్వహించాలి

నవతెలంగాణ-తాండూర్

ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాన్ని సమన్వయంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య సూచించారు. ఆయన శనివారం ఎన్నికల విధివిధానాలపై ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు 5 రోజుల సమయం ఉన్నందున పార్టీలు ప్రచారాలు ముమ్మరం చేశాయని, ఒకే రోజు ఒకే ఊరిలో ఇద్దరు అభ్యర్థుల నాయకులు ఎదురెదురుగా ప్రచారాలు నిర్వహించే సమయంలో సమన్వయం పాటించాలన్నారు. ఘర్షణలకు తగాదాలకు పాల్పడితే ఇరు పక్షాలపై కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు, యువకులు రాజకీయ వివాదాలల్లో చిక్కుకుంటే జీవితం ప్రశ్నార్థకమవుతుందన్నారు. సోషల్ మీడియా వేదికగా కుల, మత, భాష ప్రాంత విధ్వంసాలు రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, సోషల్ మీడియాపై నిఘా ఉంచామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు.

జూనియర్ కాలేజీలో రాజ్యాంగ దినోత్సవం



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీలో శనివారం 21వ శతాబ్దపు బహుజన ఉద్యమం ఎం 21 ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగంపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో జూనియర్ కాలేజీ విద్యార్థులతో పాటు మోడల్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం 21 ప్రచారకుడు చిరుకూరి కమల్, జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల కిష్టయ్య, బక్కయ్య, కొమ్ముల బాపు, సభ్యుడు మహేష్ రాజ్యాంగం, మూల సూత్రాల ఆధారంగా ఏర్పడ్డ 21వ శతాబ్దపు బహుజన ఉద్యమ సంస్థ 21 గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాస రచన పోటీలలో జూనియర్ కాలేజీ విద్యార్థి అంజలికి ప్రథమ బహుమతి, మోడల్ కాలేజీ విద్యార్థి అక్షయ్ ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. ఉపన్యాస పోటీలలో మోడల్ కాలేజీ విద్యార్థినీ రమ్యకు ప్రథమ, జూనియర్ కాలేజీ విద్యార్థి రక్షిత్‌కు ద్వితీయ బహుమతి వచ్చింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోతి కుమార్, రమేష్, చంద్రశేఖర్, భాగ్య, సత్యమ్మ, ఎం 21 ఇన్‌చార్జి పల్లె మల్లయ్య, వందన తెలిపారు.

సింగరేణి బతకాలంటే కేసీఆర్ సీఎం కావాలి



జైపూర్: సింగరేణి గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బాల్క సుమన్

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి సంస్థ బతకాలంటే మరోసారి సీఎం కేసీఆర్ కావాలని బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ అన్నారు. శనివారం ఇందారం 1ఏ, ఐకే ఓపెన్ కాస్ట్ గనులపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో పెద్దపెల్లి ఎంపీ వెంకటేష్ నేతతో కలిసి మాట్లాడారు. సింగరేణి గని కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమం పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. పెర్క్ టాక్స్ చెల్లింపు విషయమై కోల్ ఇండియాలో అమలు చేస్తున్న విధంగా సింగరేణిలో కూడా యాజమాన్యం చెల్లించే విధంగా ఇటీవల మందమర్రి సభలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. క్వార్టర్లు కార్మికులతో పాటు పదవీ విరమణ పొందిన వారికి కూడా పంపిణీ చేస్తామన్నారు. 32 శాతం లాభాల వాటా, 17 వేల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సింగరేణిని 49 శాతం వాటా కేంద్రానికి అప్పగించినప్పుడు గడ్డం వెంకటస్వామి కేంద్రంలో మంత్రిగా ఉన్నారని, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి చెప్పడం లేదన్నారు. కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

కోటపల్లి : మండలంలోని వెంచపల్లి, సూపాక, జనగామ, ఆలుగామ, రొయ్యలపల్లి పుల్లగామా, సిర్సా , ఎదుల బంధం, లింగన్న పేట, పారుపల్లి, పిన్నరం, ఏడగట్ట, ఏసన్ వాయి, సర్వాయి పేట, కోటపల్లి, షెట్‌పల్లి, శంకరపూర్, మల్లంపేట, కొండం పేట గ్రామాల్లో శనివారం బాల్క సుమన్ ప్రచారం నిర్వహించాడు. గ్రామాల్లోని దేవాలయాలను సందర్శిస్తూ ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేష్ నేత, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే బోడ జనార్ధన్ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి..అభివృద్ధి ఏంటో చూపిస్తా



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా ఆశీర్వాధించాలని, గెలిచిన తరువాత అభివృద్ది అంటే ఎంటో చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కర్ణాటక మంత్రి మునియప్పన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏండ్లుగా మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అధికారంలో ఉండి కూడా అనాలోచితమైన నిర్ణయాల వల్ల అభివృద్ధి కుంటు పడిందన్నారు. డబ్బులు, ఆస్తులు, సంపాదించడానికి కాకుండా ప్రజా సేవ కోసమే పదేండ్లుగా పని చేస్తున్నానని తెలిపారు. పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో అందరికీ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కర్ణాటక ఎమ్మెల్యే శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఎండీ. ఆరిఫ్ పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్..ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేల శ్రీరాంపూర్ ఏరియాలోని ఉజ్వల ఉన్నత పాఠశాలలో మాక్‌పోలింగ్ నిర్వహించారు. శనివారం పాఠశాలలో అవగాహన సద్సస్సుతో పాటు పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎం, ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 12 మంది విద్యార్థులు నామినేషన్ వేయగా, 8 తిరస్కరణ, ఉపసంహరణకు గురయ్యాయి. మిగిలిన నలుగురు అభ్యర్థులకు ఓటింగ్ నిర్వహించారు. విద్యార్థులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందని, ప్రతి ఐదేండ్లకు ఒకసారి వచ్చే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దండేపల్లి: విద్యార్థులకు ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించేందుకు జిల్లా డీఈఓ ఆదేశాల మేరకు శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాధారణ ఎన్నికలను తలపించేల ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది, పదవ తరగతి విద్యార్థులకు ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఎన్నికల సమయంలో నిర్వహించే ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్, ఇంక్, ఎన్నికల ముద్ర, ఓటరు స్లిప్పులు, రహస్య ఓటింగ్, పోలిసు బృందం, ఎన్నికల గుర్తులు, నామినేషన్ పత్రాలను కేటాయించారు. విద్యార్థులను పార్టీల వారీగా విభజించి ఓట్లను వేయించారు. గెలుపొందిన వారితో ప్రమాణం చేయించి, పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బిసగోని శంకర్, ఉపాధ్యాయులు సంఘర్ష్ రాజేశ్వర్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.



నస్పూర్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థిని

అవకాశం ఇస్తే ప్రజాసేవకు అంకితం



నవతెలంగాణ-తాండూర్

ప్రజలు అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే బెల్లంపల్లి ప్రాంత ప్రజల సేవకు అంకితమవుతానని బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ అన్నారు. శనివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. కిష్టంపేటలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సంపదపై ఏమాత్రం ఆసక్తి లేదని ప్రజలు ఆశీర్వదిస్తే బెల్లంపల్లిలో ఉంటూ ప్రజాసేవకు అంకితం అవుతానని తెలిపారు. స్థానికేతరుడన్న పేరుతో లేనిపోని ఆరోపణలు చేసి బీఆర్ఎస్ అభ్యర్థి లబ్ధి పొందాలని చూస్తున్నారని, తమ కుటుంబం మంచిర్యాల జిల్లాలో ప్రజల శ్రేయస్సు, కార్మికుల అభివృద్ధికి అంకితమైందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 6 గ్యారంటీలను కచ్చితంగా అమలు పరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మురళీధర్ రావు, ఎండి ఈసా, సిరంగి శంకర్, సూరం రవీందర్, మాసాడి తిరుపతి, కామన్ శ్రీనివాస్, కొనిపాక రంజిత్ కుమార్, తాళ్లపెల్లి భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-మందమర్రి

పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఏసీపీ సదయ్య ఆధ్వర్యంలో శాసనసభ ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ తమ ఓటు హక్కుని నిర్భయంగా సద్వినియోగం చేసుకునే విధంగా పట్టణంలోని సీఐఎస్ఎఫ్ క్యాంపు, శ్రీ వెంకటేశ్వర టెంపుల్, మార్కెట్ ఏరియా, స్టేషన్ రోడ్డు, సింగరేణి కార్మిక వీధుల్లో సీఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు పోలీసులు సూచించిన నియమ నిబంధనలు పాటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ, తమ ఓటు హక్కును వినియోగించుకుని, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందమర్రి, రామకృష్ణాపూర్, కాసిపెట, దేవాపూర్, ఆర్‌కేపీ 2వ ఎస్సైలు చంద్రకుమార్, రాజశేఖర్, గంగారాం, అశోక్, తానాజీ, ఏఎస్ఐలు రజిత, రవీందర్, హెడ్ కానిస్టేబుల్ గోపిక్రిష్ణ పాల్గొన్నారు.

తాండూర్ : ఎన్నికలను ప్రశాంత వాతవాణంలో నిర్వహించేల చర్యలు తీసుకుంటున్నామని ఏసీపీ సదయ్య తెలిపారు. శనివారం బెల్లంపల్లిలో తాళ్ళగురిజాల పోలీసులు, సీఆర్పీఎఫ్‌లు తిలక్ స్టేడియం నుండి బెల్లంపల్లి రైల్వేస్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సదయ్య మాట్లాడుతూ తెలంగాణ సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ జరిగేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ బన్సీలాల్, ఎస్సైలు పాల్గొన్నారు.

తాండూర్ : ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపటానికే ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తున్నామని సీఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. తాండూర్ సర్కిల్ పోలీసులు, సిఆర్పిఎఫ్ బెటాలియన్‌తో మాదారం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు లోను కాకుండా వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు సర్కిల్ పరిధిలో కవాతులు నిర్వహిస్తున్నామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో, రాజకీయ తగాదాలు జరిగే గ్రామాలపై పోలీసులు నిఘా ఉంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదారం ఎస్సై అశోక్, తాండూర్ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

మూడోసారి అధికారంలోకి వస్తే మరిన్ని పథకాలు




నవతెలంగాణ-జన్నారం

తెలంగాణలో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తే మరిన్నీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్ అన్నారు, శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్, కోఆప్షన్ సభ్యులు నరసింహులు, సిరికొండ లక్ష్మి, ఆంధ్ర పురుషోత్తం, నాగరాజు, జిలకర రవి, ప్రశాంత్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అప్పుల కుప్పగా తెలంగాణ

- బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌ను ఆశీర్వదించండి
- యూపీ సీఎం యోగీ ఆథిత్యనాథ్


ప్రజలకు అభివాదం చేస్తున్న యూపీ సీఎం యోగి, అభ్యర్థి హరీష్

నవతెలంగాణ - కాగజ్‌నగర్/కాగజ్‌నగర్‌రూరల్

సంపన్న రాష్ట్రం తెలంగాణ కేసీఆర్ పాలనలో అవినీతిలో కూరుకుపోయి అప్పుల కుప్పగా మారిందని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో శనివారం రామరాజ్య స్థాపన సంకల్పసభలో మాట్లాడారు. బీఆర్ఎస్ అంటే అవినీతి బంధువుల సమితి అన్నారు. నీళ్ల, నిధులు, నియామకాలను కేసీఆర్ పక్కన బెట్టారని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి పథంలో నడవాలంటే బీజేపీ గెలవాలని, డబుల్ ఇంజన్ సర్కార్ రావాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని, వీరిద్దరి కామన్ ఫ్రెండ్ ఎంఐఎం అన్నారు. యూపీలో ఒకే ఒక్క సీటు గెలిచిన బీఎస్పీ సిర్పూర్‌లో గెలుస్తుందా? అని ప్రశ్నించారు. సిర్పూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. హరీష్‌ను ఎన్నికల్లో ఆశీర్వదించాలని, జనవరి 22 తర్వాత రామమందిర దర్శనానికి ఎమ్మెల్యే హరీష్‌తో వచ్చి రాముడి ఆశీర్వాదం పొందాలని పేర్కొన్నారు.

తెలుగులో యోగి పలుకులు

హెలీకాప్టర్‌లో సభాప్రాంగణానికి చేరుకున్న యోగి తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించారు. 'సోదరసోదరీమణులకు నమస్కారం..బీజేపీని గెలిపిద్దాం... నవతెలంగాణ సాధిద్దాం'... 'బీజేపీ రావాలి బంగారు తెలంగాణ స్వప్నం సాకారం కావాలి' అంటూ తన ప్రసంగం మధ్యలో తెలుగులో మాట్లాడి జనాలను ఉత్తేజ పరిచారు.

నిస్వార్థసేవకై నిలబడ్డా... ఒక్క అవకాశం ఇవ్వండి : బీజేపీ సిర్పూర్ అభ్యర్థి పాల్వాయి హరీష్

గత ఎన్నికల్లో తనను నియోజకవర్గ ప్రజలు ప్రతిపక్షంగా ఉండాలని తీర్పునిచ్చారని, నిస్వార్థసేవకై మీలో ఒకడిగా నిలబడ్డానని ఈ సారి తనకు అవకాశం ఇవ్వాలని బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి పాల్వాయి హరీష్ కోరారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని దోపిడీదారులకు అడ్డాగా సిర్పూర్‌ను మార్చారని పేర్కొన్నారు. చుట్టూ నీళ్లున్నా చుక్క నీరందంచలేకపోయారన్నారు. తనను గెలిపిస్తే సిర్పూర్‌ను సస్యశ్యామలం చేస్తానన్నారు. తన ప్రసంగం మధ్యలో ఉద్వేగానికిలోనైన హరీష్ ప్రజాతీర్పుకు కట్టుబడి ప్రతిపక్షంగా ప్రజల్లో ఉన్నానని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు.



సీఎంపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-రెబ్బెన


సింగరేణి కార్మికుల భవిష్యత నిధి(సీఎంపీఎఫ్) సమస్యలు పరిష్కరించాలని కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సీఎంపీఎఫ్ ట్రస్టు బోర్డు సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సీఎంపీఎఫ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉన్న కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సీఎంపీఎఫ్ భవిష్య నిధి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, డిజిటల్ ఆన్‌లైన్ సిస్టంను త్వరలోనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రాతిపదికన వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. హౌజ్, బిల్డింగ్ అడ్మాన్, హౌజ్ బిల్డింగ్ కంట్రక్షన్, వివాహ శుభకార్యాలకు, పిల్లల ఉన్నత చదువులకు సంబంధించిన రుణాలు పారదర్శకంగా వ్యవహరించి త్వరగ మంజూరుచేయాలని, పదవి విరమణ పొందిన కార్మికుల పెన్షన్ విషయంలో జారీ చేసిన నియమానిబంధనలను పరిశీలించి స్పష్టమైన విధివిధానాలతో అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల భవిష్య నిధి, ఉద్యోగ వాటా, యాజమాన్యం వాటా కలిపి వడ్డీతో సహా భవిష్యనిధి పత్రాలను వెంటనే సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సందర్శనకు వచ్చిన ఆయనతో మొక్కలు నాటించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఎంపీఎఫ్ కమీషనర్ హరిపచౌరి, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, కోల్‌మైన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ డీఎంఎస్ చవ్వ మహేష్ కుమార్, ఇన్‌చార్జి సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్టు మజ్దూర్ సంఘ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- కర్ణాటక మంత్రి మునియప్పన్

నవతెలంగాణ-హాజీపూర్

తెలంగాణలో కాంగ్రెస్‌కు వాతవారణం ఉందని, ఈఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని కర్ణాటక సివిల్ సప్లయ్ శాఖ మంత్రి మునియప్పన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం మంచిర్యాలలో పర్యటించారు. ఈ సందర్భంగా అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. కర్ణాటక తరహాలో సంక్షేమ పథకాలు తెలంగాణ అమలు చేస్తామన్నారు. మహిళలకు రిజర్వేన్లు అమలు చేయాలని దివంగత రాజీవ్ గాంధీ ఎంతో ఆశించారని తెలిపారు. రిజర్వేషన్లతో సురేఖ, ప్రేమ్‌సాగర్ రావు ఇద్దరు అసెంబ్లీలో అడుగుపెడాతన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తే కేసీఆర్ కాంగ్రెస్‌కు ఇచ్చిన మాట తప్పారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే వాడవాడల క్లబ్బులు పెడతారని ముఖ్యమంత్రి కేసీఆర్ స్థాయి మరిచి తనపై విమర్శలు చేయడం తగదని అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. రైతు బంధు, బీమా ఓ చేత ఇస్తూనే మరో చేత ధాన్యం తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రైతులు ప్రభుత్వ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కౌలు రైతులకు కూడా కాంగ్రెస్ అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. కర్ణాటక తరహాలో తెలంగాణలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఆమోదయోగ్యమైన పథకాలను అమలు చేసి తీరుతుందన్నారు. ఈసమావేశంలో కర్ణాటక ఎమ్మెల్యేలు దేవేందర్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కర్ణాటక మంత్రి మునియప్పన్

సుమన్‌కు ఇసుకపై ఉన్న ప్రేమ రైతులపై లేదు

- రూ. వందల కోట్లు తెచ్చిన కాళేశ్వరం : వివేక్ ఆరోపణ



నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు ఇసుకపై ఉన్న ప్రేమ రైతులపై లేదని, తొమ్మిండ్ల కాలంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వివేక్ వెంకట స్వామి ఆరోపించారు. శనివారం మండలంలోని బోరంపల్లి, కొల్లూరు, రాంపూర్, దేవులవాడ, బాబ్బెర చెల్క, లక్ష్మీపూర్, వెల్మ పల్లి, రాపాన్ పల్లి, అర్జున్ గుట్ట, అన్నారం, కొత్తపల్లి, లింగన్నపేట, ఏదుల బంధం, సీర్సా, పుల్లగామా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారంటిలను తెలియజేస్తూ చేతి గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. మండల ప్రజలు పంటకు బదులు మట్టి తినే పరిస్థితినీ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. పంట మునిగిన నష్ట పరిహారం ఇచ్చే స్థితిలో కూడా ప్రభుత్వం లేదన్నారు. ఇసుక లారీలు ఎన్ని పోతున్నాయి..? ఎన్ని వస్తున్నాయి..? లెక్క ఉంది కానీ రైతులు నష్టపోయిన వివరాలు లేవన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. కాళేశ్వరం రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని, బాల్క సుమన్‌కు మాత్రం వందల కోట్లు తెచ్చిపెట్టిందని ఆరోపించారు. ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పోలీస్ అబ్జర్వర్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మూరుమూల ప్రాంతాలు, మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పోలీస్ అబ్జర్వర్ ఇలాంగో సందర్శించారు. ఈ సంధర్భంగా ధర్మారావుపేట, రొట్టెపల్లి, వెంకటాపూర్, సోనాపూర్, గట్రాప్పల్లి, కోమటిచేసు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి భద్రత అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని పోలీసులను ఆదేశించారు.



ఎలాంటి ఘటనలకు తవివ్వద్దన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, కాసిపేట, దేవాపూర్ ఎస్సైలు గంగారాం, ఆంజనేయులు పాల్గొన్నారు.

టీడీపీ ఏ పార్టీకీ మద్దతివ్వడం లేదు

నవతెలంగాణ- ఆదిలాబాద్‌అర్బన్

తెలుగుదేశం పార్టీ ఏ పార్టీకీ మద్దతు ఇవ్వడం లేదని ఆ పార్టీ కార్యాలయ కార్యదర్శి ఆకుల రాము స్పష్టం చేశారు. శనివారం ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు టిడిపి నాయకులు ఇతర పార్టీలకు మద్దతు విషయంలో అధిష్టానం స్పష్టత ఇవ్వనప్పటికీ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని తప్పుబట్టారు. రాష్ట్ర కమిటీ ఆదేశాలు లేనప్పటికీ పలువురు టిడిపి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరి తమ మద్దతు కాంగ్రెస్ పార్టీకేనని ప్రకటించడాన్ని ఖండించారు. రాష్ట్ర కమిటీ ఏ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేసిన ఆయన నాయకుల చేరిక వ్యక్తిగతమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సదరు నాయకులపై హైకమాండ్‌కు ఫిర్యాదు చేశామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తాము పోటీ చేయడం లేదని తెలిపారు. రానున్న స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తామని వివరించారు.



'ఓటు హక్కును వినియోగించుకోవాలి'

నవతెలంగాణ-జన్నారం
రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని స్టేట్ ఎక్సలెంట్ హై స్కూల్ ప్రిన్సిపల్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఎక్సలెంట్ పాఠశాల నుంచి తహసీల్దార్ చౌరస్తా వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. 30న పోలింగ్‌లో పాల్గొని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలన్నారు. మంచి నాయకుడి ఎన్నిక కోసం అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు వేయాలని కోరారు. ఓటుతోనే మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, సూరజ్, రామ్ సింగర్, కమల పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఆరు స్కీములు అమలు చేస్తాం'

నవతెలంగాణ-జన్నారం
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముజ్జు, తిమ్మాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుగ్లావత్ రవి అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాపూర్, చింతలపల్లి, బాదంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారెంటీ స్కీములపై వివరించారు. తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి బొజ్జును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, రాజు, రేగుంట ప్రదీప్, కోవా భూమయ్య, శంకరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలు

నవతెలంగాణ-కాసిపేట
మండలంలోని చొప్పరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద మందమర్రి సీఐ మహేందర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేశారు. ప్రత్యేక పోలీస్ బలగాలతో వాహనాలను, వాహనాల్లో ఉన్న సామాగ్రిని పరిశీలించారు. ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని కోరారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిరిజనులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

నవతెలంగాణ-జన్నారం
గిరిజనులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలుస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కమల విజయ ధర్మ అన్నారు. శనివారం మండలంలోని లోతుర్రాయి గిరిజన గ్రామంలో ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. గిరిజనులు అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని గిరిజనులను కోరారు. కార్యక్రమంలో పార్టీ యువజన నాయకులు రాగుల వెంకటేష్, ప్రశాంత్, కొండుకూరి రాజు, రాకేష్ పాల్గొన్నారు.

ఆదరించండి..అభివృద్ధి చేస్తా..

నవతెలంగాణ-తలమడుగు
ప్రజలు తనను ఆదరించాలని అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడె గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని రుయ్యాడి, అర్లి(కె) గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తొమ్మిదేండ్లు మోసపోయామని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్‌యేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మండల కన్వీనర్ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, ప్రకాష్‌రావు, మండల ఎస్సీ సెల్ నాయకులు నెట్టెడి అశోక్, వెంకటేష్, దయాకర్, సాంబశివ్, వెంకట్‌యాదవ్, విలాస్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థుల అవగాహనా ర్యాలీ

నవతెలంగాణ-తాండూర్
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైందని, దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరుతూ విద్యా భారతి విద్యార్థులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. మండల కేంద్రంలో ప్లకార్డులు చేత పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీలో విద్యార్థులు పాల్గొన్నారు. ఓటు హక్కు ప్రధానమైనదని ప్రజలు ఓటు హక్కును వినియోగించుకుంటు సమర్థవంతమైన నాయకుని ఎన్నుకోవాలని విద్యా భారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్ తెలిపారు.

ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-కడెం
అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖానాపూర్ పట్టణంలో ఆదివారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారని, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు జనాలను పెద్ద తరలించేల కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నిర్మల్ జడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీక్ అహ్మద్, కడెం వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ గౌడ్, రైతు బంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్ రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు



పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిర్మల్
నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు శనివారం తమ పోస్టల్ బ్యాలట్‌ను వినియోగించుకున్నారు. రెండవ శిక్షణలో తమ ఓటు హక్కును వినియోగించుకోలేని వారు జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో మూడు నియోజకవర్గాలలో ఎన్నికల విధులకు కేటాయించబడిన ఉద్యోగ, ఉపాధ్యాయులు సుమారుగా 1050 మంది, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండవ విడత శిక్షణ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోలేని వారికి వినియోగించుకోవడానికి అవకాశం కల్పించినందుకు తమ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలోని ఎన్నికల విధులు కేటాయించబడి, వినియోగించుకోలేని వారు ఇంకా ఎవరైనా ఉంటే, 26న ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్ద గల వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు.

స్త్రీలపై జరుగుతున్న హింసను ఎదిరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్
స్త్రీలపై జరుగుతున్న హింసను ఎదిరించాలని మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద అన్నారు. తిర్యాణి మండలంలోని మండల సమాఖ్యలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై జరిగే హింసల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇండ్లు, బయట ఎదురయ్యే హింసలు, అత్యాచారాలు, పని ప్రదేశాలలో మహిళలు ఎదురుకుంటున్న లైంగిక, శారీరక, మానసిక, ఆర్థిక పరమైన వేధింపులకు లోనైనప్పుడు ఆందోళన చెందకుండా ధైర్యంగా ముందుకు వచ్చి వారి సమస్యను చెప్పుకుని పరిష్కరించుకోవాలన్నారు. హెల్ప్ లైన్ నెంబర్ 181 ఉందని, పిల్లలకు మొదటి గురువు తల్లి అని వారిని సక్రమైన రీతిలో పెంచడంలో, మంచి చెడు చెప్పడంలో తల్లి పాత్ర చాలా ముఖ్యమైందన్నారు. జెండర్ స్పెషలిస్ట్ రాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రాణించాలని, ఆర్థికంగా నిలబడేలా మానసికంగా తయారవ్వాలన్నారు. బాల్య వివాహ నివారణకు కృషి చేయాలని అన్నారు. బేటీ బచావో బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన స్కీం, ఆరోగ్యం న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సదానందం, సిబ్బంది పార్వతి బాయ్, కార్యదర్శి యశోద, కోశాధికారి పద్మ ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలి



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, పీఈటీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్
జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపికై బయలుదేరుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్ అన్నారు. పాఠశాలలో చదువుతూ రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎంపీసీ మొదటి సంవత్సరం బి వర్షిని, బైపీసీ విద్యార్థి ప్రణీత, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న విద్యార్థులు అరుణ్, అరుణ్ కుమార్‌లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న మంచిర్యాల జిల్లాలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ అండర్-19 జోనల్ లెవెల్‌లో ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ తిరుపతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో దళితులకు అన్యాయం

నవతెలంగాణ-జైపూర్
పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో దళితులకు అన్యాయం జరిగిందని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం(టీఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముల సంపత్ మాదిగ అన్నారు. శనివారం మిట్టపల్లి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక వెంకట స్వామికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దళిత ముఖ్యమంత్రి చేస్తానని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మాఫీ చేస్తానని ప్రకటించారన్నారు. నేటి పదేండ్లు అవుతున్న అవేవి పూర్తి చేయలేదన్నారు. దళితులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సీఎం కేసీఆర్ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ చేసిన మోసాలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని గ్రామాల్లో వివేక్ వెంకటస్వామి తండ్రి గడ్డం వెంకటస్వామి అనేక అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంపత్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సంపత్